కథా నిలయం
శ్రీకాకుళం

# ప్రయాణం

"ప్రయాణ ఆరంభాన్ని మర్చిపోతే-గమ్యాన్ని మర్చిపోతాం..." అని అన్నదెవరోగానీ-ప్రయాణాలన్నీ గమ్యం కోసం చేసే గందరగోళయాత్రలేమో అనన్పించింది భానుమూర్తికి. సరస్వతక్క రెండో ఉత్తరం రెండ్రోజుల కిందట అందింది. మొదటి ఉత్తరానికే చెయ్యాల్సిన ప్రయాణం - కోర్టులో కేసుల్లా వాయిదాలు పడింది. ఉత్తరం భోగట్టా చెప్పాక-శాస్త్రీ, వెంకటనాయుడూ జడ్జిమెంట్ యిచ్చేసారు - యీ రోజే ప్రయాణమని!

కిరాయి మాట్లాడుకొని, టేక్సీ తెచ్చేడు వెంకట్నాయుడు. శాస్త్రీ, భానుమూర్తీ-టేక్సీయెక్కేరు. సీట్లలో సర్దుకు కూర్చున్నపుడే-

"....యే రూట్న తోలాల?" అని ప్రశ్నించేడు డ్రైవర్. గమ్యం తెలిసినా మార్గం సరయినది యెంచుకోవాలన్న ధ్వనిలో!

"...తెర్లాం జంక్షన్ మీదుగా పోనీ..." చెప్పేడు భానుమూర్తి.

"...భోజనాలకెక్కడాపాల...?"

"....అవసరంలేదు..." కిల్లీ నోటితో బదులిచ్చేడు శాస్త్రి.

"...ఆపనక్కర్లేదా, భోజనాలక్కర్లేదా?" డ్రైవర్ ప్రశ్నకెవరూ జవాబు చెప్పకపోవడంతో ముగ్గురివైపూ వెనుదిరిగి చూస్తూ-

"...మరి టీ, కాఫీలకో..?" అని ప్రశ్నించేడు మళ్లీ.

భానుమూర్తి అప్పుడు డ్రైవర్ని పరిశీలనగా చూసేడు. నడివయసు వాడేగానీ-బాగా రన్నింగయి, అరిగిన టైర్లాగున్నాడు. కారు బోనెట్ డోర్ ఊగినట్లు మాట్లాడినపుడు పై పెదవి ఊగుతోంది. కళ్లు-లైట్గా ఎర్రజీరల్తో లోవోల్టేజీ బల్బుల్లా వున్నాయి. బోనెట్ ఊగింది మళ్లీ-

"..యేటీ సెప్పేరు కాదు...?" అనడిగేడు డ్రైవర్.

భానుమూర్తి, డ్రైవర్ని పరిశీలనగా చూసేక వీడు ప్రశ్నల ఆయుధాలను, బోనెట్ తెరిచి విసుర్తూనే వుంటాడేమో ప్రయాణమంతా...అన్న సంశయం కలిగి కోర్టులో ప్రతివాదిలా ఎటాక్కి దిగాలని పూనుకున్నాడు.

"...కారులో పెట్రోలుందా...?" అని ప్రశ్నతో ఎటాక్ చేసాడు.

"...లేకపోతే నడుస్తదేటి...?"

గతుక్కుమన్నాడు భానుమూర్తి. అతడి జవాబు వచ్చినంత తొందరగా మరో ప్రశ్న రాలేదు. ఆలోచించసాగాడు. కాసేపటికి ప్రశ్న మెదిలిది.

"...టైర్లలో గాలీ, గిలీ...?" భానుమూర్తి ఎటాక్ యింకా పూర్తికానేలేదు-బోనెట్ ఊగించి -

"...చూస్తారేటయితే..?" అని కారాపి, టైర్లవైపు వేలు చూపించుతూ -

"...జల్మభూమికోపాలి...వీధులు తుడిస్సి-క్లీన్ అండ్ గ్రీన్ అనేసినట్టగ కారుకి కుదర్దు. బండిలైను మీదకి వొచ్చినప్పుడల్లా-గాలీ, గిలీ, పెట్రోల్ గట్రా..అన్నీ.." అని మిగిలిన పదాలను-బాడీ లేంగ్వేజ్‌లో పూర్తి చేసాడు డ్రైవర్.

భానుమూర్తి మరో ప్రశ్న వెయ్యలేకపోయేడు. 'యువరానర్..' అన్న పదమొక్కటే మిగిలిన ప్రతివాదిలా కూర్చున్నాడు. వెంకటప్నాయుడు నవ్వుతూ డ్రైవర్‌వైపు చూస్తున్నాడు. శాస్త్రి కిల్లీ పూర్తికాగా-సీట్లో సర్దుకు కూర్చున్నాడు. టేక్సీ-సెవెన్‌రోడ్స్ దాటి, పాతబ్రిడ్జీ మీదుగా 'నేషనల్ హైవే'కి చేరింది. నేషనల్ హైవే వేసిన "చౌదరి రోడ్స్ అండ్ రోడ్స్" వారి హోర్డింగొకటి "కుగ్రామాలకూ మార్గం- ఇది గ్లోబల్ సంగ్రామం.." కన్పించింది. శాస్త్రి కళ్లద్దాలు సర్దుకుంటూ-

"ఆ హోర్డింగ్‌లో వాక్యాలు-యేదో కవితలోని పదాలు గదా?" భానుమూర్తిగానీ, వెంకటప్నాయుడుగానీ బదులివ్వలేదు. కారు హైవేలో స్పీడ్ అందుకుంది. వెకటప్నాయుడికి అనుమానమొచ్చి-

"...ఔనయ్యా, హైడ్‌లైట్సవీ చూసుకున్నావా? మనం తిరిగొచ్చేటపుడు రాత్రి ప్రయాణం..." అనడిగేడు డ్రైవర్‌ని.

"ఎంత రాత్రయినా, పట్టు అమాసచీకటయినా, ఎడ్‌లైటు లేప్పొయినా ఫర్లేదు. భయం గియం పడొద్దు. బండికేటవదు..." రోడ్ మీద దృష్టిసారించి, డ్రైవ్ చేస్తూ బదులిచ్చేడు డ్రైవర్.

"...అంటే? బండి ఆపేస్తావా?" అనడిగేరు శాస్త్రిగారు.

అర్థమయినట్టుంది-పడి పడి నవ్వేడు డ్రైవర్. బోనెట్ ఊగి, ఊగి ఆగేక, శాస్త్రిగారి మీదకి లోవోల్టేజ్ చూపు క్షణకాలం విసిరి-

"...కండిషన్‌ల బండి వుంతేనే రోడ్డెక్కిస్తాను. లేపోతే షెడ్డే! మా వోనరు కిక్కురుమనడు. ఆc..." అని చెప్పి, ఒకసారి, టెస్ట్ చెక్‌గా లైట్ స్విచ్‌లన్నీ వేసి చూసుకున్నాడు.

"ఎవరయ్యా మీ ఓనర్?" అనడిగేరు శాస్త్రి.

"...ఎక్కవుంటెంట్ దేవదానం గారు..."

"....బ్యాంక్ ఆఫీసర్స్ పనే బాగుంది. జీతాలూ అయిందకెల మీద! అన్నీటికీ లోనిస్తుంది బ్యాంక్..." శాస్త్రి మాట పూర్తికానేలేదు.

"...ఎవురికి బాగోలేదు? అందరికీ బాగుంది. మేస్టర్లకి బాలేదా? ప్రైవేట్ కాలేజీల అందుకున్న దాంతోటి అడ్డమైన బిజినెస్‌లూ ఆళ్లవే. ఆళేటి, యిాల్లేటి గవుర్నమెంట్ నవుకరీ వాళ్ళు అందరూ బాగున్ను..." అని ముగించి, బాడీ మీద పేద్ద గ్రానైట్ రాయితో నెమ్మదిగా వెళ్తున్న లారీని సైడ్ యిమ్మని-దాని డ్రైవర్‌కి కాషన్‌జేస్తూ, హారన్ కొట్టసాగేడు డ్రైవర్!

గ్రానైట్ లారీ సైడిచ్చింది. కారు దాన్ని ఓవర్‌టేక్ చేసింది.

"..యిక్కడి కొండల్లోని రాయి-యెక్కడెక్కడి దేశాల గడపలకో ప్రయాణమవుతోంది" అన్నాడు భానుమూర్తి, లారీని చూస్తూ.

"...ఎక్కడ యేది పనికొస్తాదో అక్కడికది యెలిపోతంది. ఇక్కడి మనుషులు ఫారెన్ యెళ్లిపోలేదా? వొకటీ, యెక్కడేనా పనికొచ్చి సరుకు మనలోనుండాల" - మళ్లీ హారన్ మోగించి, సర్రున ఎడమ ప్రక్కకి కారు కట్‌చేసి, మళ్లీ చెప్పసాగేడు.

"రోడ్డులింకా వెడల్పు చెయ్యాలసార్.. ట్రాఫిక్ పెరిగిపోయింది. టక్కర్లు, బస్సులూ, టాక్సీల్లు...స్కూటర్లు..ఎన్నొచ్చేయి? అదిగాక యివతల కలకత్తా, అవతల మద్రాసుకి రోడ్డిది!" అని మాటలాపేసి, జాగ్రత్తగా డ్రైవ్ చెయ్యసాగేడు.

"...హైవే వొదిలేస్తాంగా; చిలకపాలెం జంక్షన్ నుంచి, రాజాం రూట్‌లోకి వెళిపోతే యింత ట్రాఫిక్కుండదు..." చెప్పేడు వెంకట్నాయుడు.

డ్రైవర్ యేమనలేదు. ఏకాగ్రతతో కారు నడుపుతున్నాడు.

"సరస్వతక్క తీర్థయాత్రల కోసమే వొస్తాననన్నదంటావా?" శాస్త్రిని మళ్ళీ ప్రశ్నించాడు భానుమూర్తి.

"...నా తరం కాలేదురా.. ఆమె అంతరార్థం గ్రహించటానికి..." భానుమూర్తికి నెలరోజుల కిందటి ఉత్తరం.

"...జయక్రిష్టా కమలా మీకేమేనా ఉత్తరాలు రాస్తున్నారా? ఒకే యింట్లో వుంటన్నమేగానీ వొకరికొకరం యెంతో దూరంగున్నామన్నిస్తోంది! వాళ్లిద్దరూ బయటపడటం లేదుగానీ సఖ్యంగా లేరు. నాతోననేగాదు వాళ్లలో వాళ్లూ...! నువ్వోసారి వొచ్చి కనుక్కుంటే బాగుణ్ణు..." సరస్వతక్క గుంభనంగా రాసిన వాక్యాలు గుర్తొచ్చేయి.

అప్పుడు భానుమూర్తి వెళ్లలేకపోయేడు. శాస్త్రి వెళ్తున్నానంటే-ఉత్తరం చూపి; సరస్వతక్కని కలిసి విషయాన్ని ఆరాదీసి రమ్మన్నాడు.

శాస్త్రీ, వెంకట్నాయుడూ, భానుమూర్తీ బాల్యస్నేహితులు!

"త్రిమూర్తులూ, నిలబడండ్రా, నిన్న మామిడి తోటలో మీ విన్యాసానికీ, యిపుడు ఎక్కాలు వొప్పజెప్పనందుకూ తియ్యండ్రా వంద గుంజీలు..." అనే మాష్టారికి "వంద మూడుతో భాగిస్తే వొకటి శేషముండిపోర్ది మేస్టారూ..." అనడిగేవాడు శాస్త్రిది.

"...అయితే అది నన్ను తియ్యమంటావా వెధవా?" అని బెత్తంతో వొకటి వేసేవారు మేస్టారు.

"ముగ్గురూ గొప్ప జట్టురా! త్రిమూర్తులు! అయితొకటీ-అనసూయాదేవి, ఆడించిన బాలత్రిమూర్తులు.." అనేవారు మాస్టార్లు.

ముగ్గురూ, ఎలిమెంటరీ తర్వాత హైస్కూల్ చదివీ; కాలేజీకి బొబ్బిలి, ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు బహద్దూర్ కాలేజ్‌కి వెళ్లేరు. ఆ తర్వాత, శాస్త్రి పోస్టల్ డిపార్టుమెంట్‌లో క్లర్కుగా చేరిపోగా, వెంకట్నాయుడు బనారస్ హిందూ యూనివర్సిటీలో బోటనీలో పిజి కోసం చేరేడు. భానుమూర్తి బి.ఎల్. చేయటానికి, చెట్లు వెదుకుతూ వెళ్లేడు. చివరికి శాస్త్రి పోస్ట్ ఆఫీస్ సూపరింటెంటెట్‌గానూ; వెంకట్నాయుడు జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గానూ, భానుమూర్తి మున్సిఫ్ మేజిస్ట్రేట్‌గానూ...వొక యేడాది అటూ, యిటుగా రిటైర్‌మెంట్ దశలో వున్నారిపుడు! ముగ్గురూ యీ స్టేజిలో మళ్లీ వొకే ఊళ్లో ఉండగలిగినందుకు వాళ్లకెంత సంతోషమో...! వారి, వారి పిల్లల ప్రపంచంలో యిమడలేక యింత స్వంత ప్రపంచంలో కబుర్లు కలబోసుకు ఆనందిస్తారు. ఆ ముగ్గురిదీ ఒక ప్రపంచం.

"...జయక్రిష్ణ యేమన్నాడ్రా?" అనడిగేడు భానుమూర్తి.

"...ముప్పయి మూడు శాతం రిజర్వేషనంటాడు. కమలేమో, ఆకాశంలో సగం అంటుంది..." హాస్యధోరణిలో శాస్త్రి.

కారు...చిలకపాలెం జంక్షన్‌చేరి, రాజాం రోడ్ మలుపు తిరిగింది.

డ్రైవర్ రిలీఫ్ ఫీలయినట్టుంది. టేప్‌రికార్డర్ ఆన్ చేసాడు. "భళ్లే భళ్లే భళ్ల..భళ్లా..." ఎవరిదో పాప్‌సింగర్ గొంతు-కొండల మధ్య ప్రతి ధ్వనిస్తోన్నట్టు విన్పిస్తోంది.

"...అతగాడి గొంతునొక్కెయ్యవోయ్..." డ్రైవర్‌కి చెప్పేడు శాస్త్రి. డ్రైవర్ వో చూపు యిటు విసిరి-

"...గొంతు నొక్కడం గనకార్యమేటి...?" అన్చెప్పి, వాల్యూం తగ్గించేడు. కారువేగాన్ని పెంచేడు. ఆ పాట డ్రైవర్ని కదిపిస్తోంది. శాస్త్రి యేమనలేకపోయేడు.

భానుమూర్తి - సరస్వతక్క ఆలోచనల్లో వున్నాడు. వెంకట్నాయుడు రోడ్డు ప్రక్క కనిపించే దృశ్యాలు చూడసాగేడు. ఇంకా శివరాత్రి వారం రోజులుంది గనకా - మధ్యాహ్నవేళ ప్రయాణమైనా ఎండలో అంతగా వేడిలేదు. వర్షాధార మెట్ట భూములు-రోడ్డుకిరువైపులా, కనుచూపుమేరా బీడువారి కన్పిస్తున్నాయి. ధూళిమేఘం, దానికింద బీడువారిన సువిశాల భూఖండం-చిన్నచిన్న మందలుగా పశువులూ...! వాటిని కాపుగాస్తోన్న తాటాకు గొడుగుల పశుల కాపరులూ..వొక చిత్రకారుని నిశ్చల చిత్రంలా కన్పిస్తోంది!

కానీ, మిగిలిన ప్రపంచమిలా లేదే! పెనుతాకిడికి గురయ్యిందే! అందరమూ-యెలాగో బతికేస్తున్నాము తప్పా-క్షణకాలమైనా జీవిస్తున్నామా...?

"...చూడండిరా! ఇంకా యెంతో కొంత ప్రపంచమూ, యెందరో కొందరు మనుషులూ, పెనుతాకిడికి దూరంగా, పరుగులూ, పందేలూ లేకుండా నిశ్చలంగా, నిదానంగా-పశుపక్ష్యాదుల ప్రపంచంతో జీవిస్తున్నారు..." అని ఆ దృశ్యాన్ని చూడమన్నాడు వెంకట్నాయుడు.

భానుమూర్తీ, శాస్త్రీ చూసేరు.

"...యింకా యెంతో భూమిని అనుత్పాదకంగా వదిలేసి, ఇంకా యెందర్నో ఉత్పత్తి శక్తులుగా అభివృద్ధి చెయ్యలేకపోయిన వ్యవస్థకి యివి రుజువులు..." అన్నాడు శాస్త్రి.

భానుమూర్తి...జడ్జ్ చేసుకోలేకపోతున్నాడు. వీళ్లిద్దరి అభిప్రాయాలూ సరయినవే అన్పిస్తున్నవి. ఒకే విషయం గురించి రెండు భిన్నమైన భావాలు సరైనవెలా అవుతాయి? తప్పు యేదో తెలీక-రెండింటినీ ఒప్పు అనుకుంటున్నామా? ప్రశ్నలు..! ప్రశ్నల్లోంచి భానుమూర్తికి, గతంలోని దృశ్యం కదలాడింది...

గోధూళివేళ, తన బావ పరాంకుశం యింటికి, తండ్రి చిటికెనవేలు పట్టుకు వెళ్ళడం. అప్పటికే బావగారి యింటి వీధి అరుగుల మీద రైతులు కూర్చోవటం-తండ్రి చిటికెన వేలు వొదిలేసి తను పెరటిలో సరస్వతక్క దగ్గరకు పరుగెత్తటం...దృశ్యం కదిలింది.

అక్కతో ముచ్చట్లకంటే-వీధి అరుగుమీద రైతుల గొంతులెందుకో ఆకర్షించేయి. భానుమూర్తి, అరుగు మీద కూర్చున్న తండ్రి ఒడిలోకి వొచ్చేడు. తండ్రి మొహంలో అంతకు ముందరి ప్రశాంతత లేదు. సంధ్యవెలుగులో మొహం కందగడ్డ అయ్యింది.

"...ఎప్పటిలాగా కౌలు చెల్లించంటమో, లేదా భూమికి ధర చెల్లించేసి కొనుక్కోవటమో చెయ్యాలి..." ఆఖరి మాటగా చెప్పేరు పరాంకుశం.

"....ఇది రాజీయా? సంస్కరణా?" ప్రశ్నించేడు వెంకట్నాయుడి తండ్రి.

"...నాయకుల రాజకీయం..." వెటకారంగా, తన తండ్రి పలికేడు. తండ్రి మొహంలోకి, చూసేడు తను.

"పోనీ, యేదయితేమి? రైతుకి లబ్ధి కలుగుతోంది గదా....?" సర్దిచెప్పబోయేరు పరాంకుశం.

"...అంతకంటా లబ్ధి ఆళ్లకే! జమీందార్లకీ, రాజులకే..." తన తండ్రి బదులిచ్చేడు.

"...నష్టపరిహారం యివ్వకుండా యెవరి ఆస్తులూ స్వాధీనం చేసుకోగూడదని.." అది యెవరి నిర్ణయమెూ, యే రాజకీయ సైద్ధాంతిక భావమో, స్పష్టంగా తెలీని పరాంకుశంగారు...వాక్యాన్ని పూర్తిచేయలేకపోయేరు.

భానుమూర్తిని, ఒడిలోంచి లేపి, తనూ లేచి–

"... ఆ ఆస్తులు ఆళ్లకెలా వొచ్చేయో చెప్పగల్రా?" ప్రశ్నిస్తూ విసురుగా, నడిచి పోయేడు తన తండ్రి! అతని వెంట, పరుగులాంటి నడకతో భానుమూర్తి.

ఆ గోధూళివేళ, మునిమాపు వెలుగులో భూమి పుత్రులు జరిపిన సంభాషణ. యెప్పటికీ మర్చిపోలేదు భానుమూర్తి. అప్పటికి నాల్గవ తరగతి విద్యార్థి. చదువూ, సాగుతోన్న జాతీయోద్యమం, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా రైతాంగ పోరూ–రైతుల స్వాధీనమయిన నేలతల్లీ–రైతులపై కాల్పులూ కథలు కథలుగా పాడే జముకుల పాటలూ కళాపెళా మరిగే నీటిలాంటి బాల్యం గుర్తొచ్చింది భానుమూర్తికి.

ఇప్పటికీనా....?

దాదాపు అరవయ్యేళ్ల వయసులోనా–జీవితం కళాపెళా మరుగుటలేదూ? భానుమూర్తి ఆలోచనల్ని–"ముస్తఫా–ముస్తఫా" పాట ఢీకొట్టింది.

టేక్సీ తెర్లాం జంక్షన్ మలుపు తిరిగింది. కొంతదూరం పోయేక పల్లపుభూములు, అక్కడక్కడా రోడ్డుకి చేరువలో చెరకు వంట గానుగలు! గానుగల్లోంచి నల్లటి పొగమేఘాలు, గాలిలోంచి బెల్లపు వాసన! దగ్గర దగ్గరగా గ్రామాలూ, చెట్టూచేమలూ, తోటలూ, పచ్చని పొలాలూ! దృశ్యం పూర్తి భిన్నం యింతకు ముందురికి! కేసెట్‌లోంచి "ముస్తఫా.." కీచుగొంతు...భరించలేక శాస్త్రి ముందుకి వొంగి, చెయ్యిచాచి, టేప్‌రికార్డర్ ఆపేసాడు. ధ్వనులాగి పోయినయి. గాలిలోంచి, తియ్యని బెల్లపువాసన! నల్లరేగడి పొలాల్లోకి, కాలువల్లోంచి ప్రవహించే నీరు!

టేక్సీ వేగావతి బ్రిడ్జి మీదకొచ్చింది. ముందర, నాలుగైదు చెరకుబళ్లు! బళ్లకు ప్రక్కగా నెమ్మదిగా కారుపోనిస్తూ–ఓచేత్తో, ఓ బండి మీద చెరకుగడలాగబోయేడు డ్రైవర్.

"...వుండుండు. నువ్వు తియ్యలేవు..." అన్చెప్పి; బండికి మీద వరసలోంచి ఒక చెరకు గడ తీసి, మధ్యకి విరిచి ముక్కలందించేడు బండి వెనుక నడుస్తోన్న నడిగాలపు రైతు.

ఆ రైతు వెనక బండికి, ముందు నడుస్తోన్న యువరైతు.

"...లోపల బాబులూ–తింటారు గావాల..." అని మరో చెరకు గడ తియ్యబోయేడా రైతు.

కారులో కన్పిస్తోన్న ముగ్గురివైపు చూసి–

"...లోపలన్నోళు ఆఫీసరుబాబుల్లాగుంది! ఆళ్లేటి తినగల్రు చెరుగ్గడ? పంచదారగాదు సప్పరించీదంకి..." అనన్నాడు.

మరది వ్యంగమో, వాస్తవమో ముగ్గురు మిత్రులూ సిగ్గుపడ్డారు. భానుమూర్తి ఆ యువరైతుతో–

"...ఎలా వుందయ్యా చెరకు? కిట్టుబాటవుతోందా?" అని ప్రశ్నించేడు కార్లోంచి మొహాన్ని బయటికి పెట్టి.

"...ఆడికేటి తెలుస్తాది? నన్నడుగు బావూసెప్తాను.."అని, నడిగాలపురైతు, కారుకి ప్రక్కగా వచ్చి-

"...తొలితొలీత రైతోడు. యే పంటయినా తిండికోసరమే పండించీవోడు. పంటలు పండితే నలుగురికీ కడుపు నిండేది. తరాత్తరాత మిల్లులొచ్చినాయి. మిల్లు పంటలొచ్చేయి. పేక్టరీలొచ్చినాయి. ఇప్పుడైతే యేటేటో వచ్చినాయి. అన్నీ అమ్మకం కోసరమే పంటలొచ్చినాయి. అదిగా అమ్మకం బజారొక సుడిగుండం. అందలబడి గిరి, గిరా కొట్టుకుంతండు రైతోడు.." అతనింకా, యేమేమో చెప్తున్నాడు. హారన్ గొడుతూ, దారి తీసుకుని, స్పీడ్ పెంచేడు డ్రైవర్. రైతులు వెనుకబడినారు.

వెనక నుంచి రైతు మాటలు విన్పించటం లేదుగానీ-అతని చేతుల సౌంజ్ఞలు కన్పిస్తున్నాయి. కనుమరుగవుతోన్న ఆ రైతు...యెప్పటిదో, పదిహేనేళ్ల కిందటెన్నటిదో... రోగగ్రస్తమై, మంచమ్మీంచి సంజ్ఞల్తో, మూలుగుల్తో గుండె ఘోష విన్పించిన, తన బావ రూపాన్ని గుర్తుదెచ్చేడు.

"...భానూ, మీరు ఊళ్లొదిలేసినోళ్లు. మీకు తెల్దు. ఊళ్లూ, భూములూ, బతుకులూ... కలలుగన్నాం. పథకాలూ, ప్రణాళికల్తో ఊళ్లల్లో రైతు తలపాగా విజయపతాక మవుతదనుకున్నాం. దివానం, జమీందారీ దినాలలోన భూమ్మీదా, పంటమీదా రైతుకి అధికారం వుండేదిగాదు. గానిపుడు - ఆ రెండిటిమీదా అధికారముందిగానీ అది అనుభగించే యోగం కలగలేదు. పంటతోనున్న మడిసెక్కకి నీరుబెడితే..యెక్కడ బొంగలు పడ్డాయో మరి నీటిచుక్క మిగలకంటంది.

మీ నాయనకి యెక్కడ బొంగలు పడ్డాయో తెల్సు. అయితేట్లాభం...? భగభగా మండి... యింత మంటయ్యేడు..మంట...వెల్తురు అవతాదా?

మీ నాయన...మిమ్మల్ని నా కప్పజెప్పి కాలిపోనాడు. ఇప్పుడు యిదీగీ సుడిగుండంల మునిగిపోతంది నా తలపాగా! నాచెయ్యి పట్టుకున్న నా బిడ్డలకి యిక నువ్వు చెయ్యందియ్యాల..." యింకెన్నో చెప్పాలనుకున్న బావ శ్వాస ఆగింది.

బతుకు యుద్ధంలో ఓడిపోయిన బావ! పోరాడి, పోరాడి, గిరిసీమల నుంచి, మైదానపు పల్లెలదాక వొక నెత్తుటి మంటను వెలిగించి దగ్ధమైన తండ్రి!

అసంకల్పితంగా భానుమూర్తి కళ్లల్లో నీళ్లు తిరిగేయి. గుండెల్లో దుఃఖం పొంగింది. పెదవులు బిగించి, కన్నీటిని ఆపుకొని దీర్ఘంగా నిట్టూర్పు విడిచేడు.

టేక్సీ గ్రామాల మీదుగా బొబ్బిలిపట్నం పొలిమేర్లలోకి చేరింది. ఏదో విదేశీ కంపెనీ కూల్‌డ్రింక్ హోర్డింగొకటి - రోడ్డంత వెడల్పుగా, యెత్తుగా, సుందరంగా ఆహ్వానిస్తోంది. ఆ హోర్డింగ్స్‌ని చూస్తూ -

"విదేశీయుల్ని తరిమిన బొబ్బిలి రాజ్యంలో విదేశీ డ్రింక్ కంపెనీ స్వాగతం చెప్తోంది..." నొచ్చుకున్నాడు శాస్త్రి.

"ఆపేదేటండీ...?" అడిగేడు డ్రైవర్ డ్రింక్ కోసం!

"...వొద్దొద్దు. ఇక్కడికి దగ్గరే ఊరు. అక్కడ కొబ్బరి బొండాలు తాగుదాం..." అన్నాడు వెంకటప్పాయుడు.

"...బొండాలుండొద్దా అక్కడ?" విసుక్కొని, కారుస్పీడ్ పెంచేడు డ్రైవర్.

కొంతసేపటికి పట్నందాటి, ఊరు దారిలో కొచ్చింది టేక్సీ. ఊరి పొలిమేరల్లో జన్మభూమి ద్వారం పసుపుపచ్చగా నిల్చివుంది. అది దాటేక అంగన్‌వాడీ బిల్డింగూ, పశువుల ఆసుపత్రీ...తలుపులు మూసుకొని వున్నాయి. ఊరి నడివీధి కూడలి. బడ్డీకొట్లూ, కిరాణాషాపులూ.

భానుమూర్తి దారి చూపగా ఓ పెంకుటింటి ముందాగింది టేక్సీ. పెంకుటింటి ముందరి గడప పెచ్చులూడిపోయి, అక్కడక్కడా గచ్చు తనున్నానని...ముక్కలుగా ముఖాన్ని చూపుతోంది. గోడలకు సున్నం కన్పించకుండా...దుమ్ము, ధూళి రంగేసుకుంది. గోడలకున్న యిటికలు కొన్నిచోట్ల...బయటిపడి పలుకరిస్తున్నాయి. ఆ యిటికల ముక్కల గొయ్యిల్లో... చక్కగా చీమలు సమావేశాలు జరుపుతున్నాయి. పెంకులు కొన్ని..నాచుమొక్కల్ని పెంచేయి.

ఇంటిగడపలో వొక నులకమంచం - పురాతన మిత్రుడిలా వుంది. దానికెదురుగా రెండు నీల్‌కమల్ ప్లాస్టిక్ కుర్చీలు, గౌరవ అతిథుల్లా వున్నాయి.

కారు హోరన్ శబ్దానికేమో యింట్లోంచి యిద్దరు పిల్లలు గబగబా పరుగెత్తుకొచ్చేరు. కార్లోంచి దిగి, యింటివైపే వొస్తోన్న వార్ని చూసి, వొచ్చినంత గబగబా యింట్లోకి పరుగెత్తి...

"...నానమ్మా చుట్టాలొచ్చేరు..." అని కేకేసారు.

భానుమూర్తి గడపలో కుర్చీలను మిత్రుల కోసం ఆఫర్‌చేసి, తను నులకమంచమ్మీద కూర్చున్నాడు.

పిల్లల కేకలకు, యింట్లోంచి గబగబా సరస్వతక్కా కమలా వొచ్చేరు. పలకరింపులూ, పరామర్శలూ అయ్యేక సరస్వతక్క నీల్‌కమల్ కుర్చీలకి ఉత్తరంవేపు గోడకి చేరబడి కూర్చుంది. కమల, మునివాకిట ద్వారాన్ని ఆనించి నిల్చుంది. కాసేపు...యెవరూ యేమీ మాట్లాడలేదు.

భానుమూర్తే గొంతు సవరించుకొని,

"...జయక్రిష్ణ యెటెళ్లేడు?" అనడిగేడు.

సరస్వతక్క జవాబివ్వలేదు. ఆమెని చూస్తూ కమల-

"...పట్నమెళ్లేరు. ట్రిప్పుల బస్సుకొచ్చేస్తారు.." అని చెప్పింది.

"...కమలకి టీచర్ ఉద్యోగం వొచ్చింది. గజపతినగరం మండలంలో..." వార్తగా చెప్పిందో, సంతోషంగా చెప్పిందో తెలీని స్వరంలో చెప్పింది సరస్వతక్క.

అప్పటికి పిల్లలిద్దరూ శాస్త్రికి చనువయ్యేరు. ఓ ప్రక్క శాస్త్రి ప్రశ్నలకు జవాబులు చెబుతూనే యింకో ప్రక్క తల్లీ, నానమ్మలతో భానుమూర్తి సంభాషణను వింటున్నారు.

"...మేం, యిక్కడుండం. ఊరు మారిపోతాం తెల్సా? గజపతినగరం వెళిపోతాం. అక్కడ మంచి కాన్వెంట్‌లో చేరతాం..." పెద్దపిల్ల చెప్పింది.

కమలవైపు సరస్వతక్కా భానుమూర్తీ వొకేసారి చూసేరు. కమల, చూపులు దించుకుంది. కాసేపటికి, గొంతు సవరించుకొని-

"...యీ మండలంల ఖాళీల్లేవు. జెడ్పీ ఛైర్మెన్‌ని కలిసేరితను. అయినా, అక్కడకిచ్చేరు పోస్టింగ్స్. రోజూ వెళ్లిరావటం కష్టంగుంది..."

"...నానమ్మ రాదంట..." శాస్త్రికి ఫిర్యాదు చేసింది చిన్నపిల్ల.

"...మీ నాన్న నాకు యీ ఊరితోటి లంకె తెంపీమంటే, వింటన్నాడా?" అని పిల్లల్తో చెప్పి; "పసుపు కుంకుమలకింద మీరిచ్చిన ఎకరా భూమి వొదిలిసేడు. మిగిలిన భూమంతా...అమ్మేసాడు. అదిగో, ఆ రిజిస్ట్రీకే యేళ్లేడు..." భానుమూర్తితో చెప్పింది సరస్వతక్క.

అప్పటికి ఆ యింట్లో చోటుచేసుకున్న చల్లటి యుద్ధపు నేపథ్యమేదో తెలిసింది భానుమూర్తికి. మిత్రులవైపు చూసేడు. శాస్త్రి కళ్లతోనే విషయమంతటినీ గ్రహించేనన్నట్లు చూసి-

"...జంఝావతి రిజర్వాయర్ పూర్తయి వుంటే యీ ప్రాంత రైతులు భూములమ్ముకోకపోయిన్ను..." అన్నాడు.

"...పాతికేళ్లయ్యింది. ఎస్టిమేషన్ కాస్ట్ యేటకేటా పెరిగిపోతోంది. ఇంకోవైపు ప్రభుత్వాల ఆర్థికస్థితి దిగజారిపోతోంది. మరి ఆ రిజర్వాయర్ పూర్తిగాదు..." వెంకట్నాయుడు, మొహం నిండా చికాకు నింపుకుంటూ పలికేడు.

"...నైరుతీ ఋతుపవనాల ఆదిలో వర్షాలొస్తాయి. ఆకులుపోస్సి, ఎరువులేసి పెంచి నాట్లేసెస్తామా? ఒకటి రెండు వానలు అందుతాయి. వొకటి రెండుసార్లు ఎరువులూ, మందులూ కొడతాం. ఇకంతే. చేను పొట్టకొచ్చి ఆగిపోతుంది. మరివాన పడదు. పొట్ట గింజగట్టదదు. పెట్టిన మదుపుకైనా పంటరాదు. పంటలిన్నిసార్లు పోతే రైతు తట్టుకోగలడా...?" కమల వివరించింది.

"....టీ పెడతాను..." అని లేవబోయింది సరస్వతక్క.

"...టీ వొద్దక్కా. ఎండ తగ్గలేదింకా. బొండాలు తెప్పిద్దూ..." చెప్పేడు వెంకట్నాయుడు.

"...యిక్కడుంచుతన్రా బొండాలు? పట్నమెళిపోతన్నాయి..."చెప్పింది సరస్వతక్క.

"నేను చెప్తే నమ్మేరుగాద..."న్నట్టుగా, గడప అరుగుమీద కూర్చున్న డ్రైవర్ చూసేడు.

అంతలో, వీపుకి పురుగుల మందు కేన్ కట్టుకొని, స్ప్రేయర్ చేత్తో పట్టుకొని, తలకి తువ్వాలు పాగాలా గాక, పూర్తిగా వుండచుట్టేసి, ముక్కూ, మూతి మూయడానికి, కొంతభాగాన్ని వేలాడదీసుకుని, ఆ వాస కొస నుంచి వొస్తోన్న కురిమినాయుడు గడపలోని భానుమూర్తిని చూసి,

"....మేస్టీటు బావు లాగుంది..." అని పలకరించేడు. ఆ తర్వాత, మిగిలిన యిద్దర్నీ కళ్లతో పలకరించి -

"...తుమ్మముల్లు జంటలు కలిసేవున్నాయన్నమాట..." అన్నాడు నవ్వుతూ. కురిమినాయుడి రూపాన్ని చూసి భానుమూర్తి ఆశ్చర్యపోయేడు. కురిమినాయుడు తమ కంటే జూనియర్. హైస్కూల్ ఫైనల్కొచ్చేసరికి కురిమినాయుడు ఎయిత్క్లాసు. ఆ తర్వాత కొన్నాళ్లు అతని వివరాలు తెలీవు. పియూసి చదివి, డిగ్రీ చెయ్యలేక బొబ్బిలి జూట్మిల్లులో చేరేడు. మిల్లులో కొన్నాళ్లకి యేదో పోరాటం చేసినందుకు నౌకరీ పోయింది. అప్పట్లో భానుమూర్తి వకీలు. వీళ్లకేసులు వాదించేవాడు. తర్వాత, కురిమినాయుడు సీతానగరం సుగర్ ఫ్యాక్టరీలో చేరేడు. కాలి, కమిలిన పొగ గొట్టంలా వుండేవాడు.

"....సరస్వతక్కా...నీ దగ్గరకొచ్చేస్తదన్నమాటైతే...?"అనడిగేడు కురిమినాయుడు.

ఆ ప్రశ్న పూర్తిగా అర్థంగాలేదు భానుమూర్తికి. కొంతే అర్థమైంది. తీర్థయాత్రల కోసమొస్తానని గదా అక్క ఉత్తరం?

"...మగోళ్లమే ఊరొదిలేస్తన్నాం. ఆడకూతుర్లకి సాధ్యమా?" మరో ప్రశ్నో, వెయ్యని ప్రశ్నకు, సమాధానమో అన్నట్టు చెప్పేడు కురిమినాయుడు.

"...ఆవిడి తాలూకా భూమిని ముట్టుకోలేదు మేము. ఆవిడికే వొదిలేసేం..." యెందుకో నొచ్చుకుంది కమల.

"...కూతురా! నీ చేతిలా, నా చేతిలా లేదు. బతుకుల్ని యెవుడో జూదంజేస్సి ఆడతండు. అదు దేవుడు మాత్రం గాదు. వొక ఆటకి నువ్వు, మరొక ఆటకి నేనూ గెల్చినట్ట కన్పించుతాదిగానీ, కొనకి గెలుపు ఆ జూదసాల యజమానిదే.."

కనులను సముదాయించినట్టు మాట్లాడేడు కురిమినాయుడు. కమల దిగాలుగా యింట్లోకి వెళ్లిపోయింది. ఆమె వెళ్లినవైపే చూస్తూ "...కట్టెతోటి కైలాసం వెళిపోతామా? భూమిని మోసుకుపోతానా? ఈళ్లని ముట్టొద్దన్నానా? ఆ భూమితోపాటే..యిదీ అమ్మెయ్యి నాయినా. అంటే; అది నీ కన్నోరి భూమంటాడు. నువ్వు నా కన్న కొడుకువి గాదా అంటే ఆళ్లొదిలి మాతోటి రానంటన్నావుగదా అనడుగుతాడు. పండగా పున్యాలకీ, మంచికీ, చెడ్డకీ, రాకపోకలకి కూతుళ్లెక్కడికి వస్తారు. నువ్వెక్కడికొస్తావు? తాతగారింటికి, యెల్దామనే మనవళ్లకోసమని... ఇంకెన్నాళ్లుండిపోతాను. ఊరు పొమ్మంటుంది. కాదు రమ్మంటుంది..." గొంతునిండా దుఃఖపు కల్లేచేరి, మాట్లాడలేక ఆగింది సరస్వతక్క.

"...నాల్రోజులు మీతోటి తీసికెళ్లమే మంచిది. లోకం సూస్తాది..." కురిమినాయుడు చెప్పేడు భానుమూర్తికి.

"...శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరసవిల్లీ పుణ్యతీర్థాలుగదా, తిరిగొద్దామని..." సరస్వతక్క గొంతు సర్దుకుని చెప్పింది.

"...నాకా భాగ్యం కలిగితే తిరిగి మరి రాను. ఆ తీర్థాలకాడే కావిడి దించిద్దును.." నవ్వుతూ, గుండెలోపలి వేదనని చెప్పేడు కురిమినాయుడు.

"...వెళ్లడం, రావటం మన చేతుల్లో వుందేటి? దైవ సంకల్పం..." అంది సరస్వతక్క.

ఆ మాటకు భయం వేసింది భానుమూర్తికి. అక్కవైపు ఆర్తిగా చూడసాగేడు వెంకట్నాయుడు.

"...నువ్వు మా కంటే చిన్నగదా?" అనడిగేడు కురిమినాయుడ్ని.

"...బతుక్కీ చిన్నే.వొయసుకీ చిన్నే..." చెప్పేడు కురిమినాయుడు.

"...అదిగాదు, నేనన్నది. మా తర్వాత మూడో బేచిగదా స్కూల్ ఫైనల్‌కి? మీ క్లాసులో, నువ్వొకడివీ, మరో స్టూడెంట్ సత్యంనాయుడనుకుంటాను...ఫస్ట్‌రేంక్ స్టూడెంట్స్. అతనేం చేస్తన్నాడూ..." అనడిగేడు.

"అతను పురుగుల మందు తయారుజేస్తే... నేను ఆ మందుని కొడతన్నాను..." అని నవ్వి,

"....అదేదో పెస్టిసైడ్ కంపెనీల నౌకరీ. బాగానే వున్నాడు.." చెప్పేడు కురిమినాయుడు.

"...ఈడితోటోళ్లు...అంతోయింతో బాగానే వున్నారు. ఈడికే దినం తీరిందిగాదు.." అంది సరస్వతక్క.

శాస్త్రి పిల్లల్తోపాటు వీధిలో ఆపిన కారు దగ్గరకు నడిచేడు వెంకట్నాయుడు.

"...నిల్చొనే వుండిపోయేవు. కూర్చున్నావు గాదు.." కూర్చోమన్నాడు కురిమినాయుడ్ని.

"...హనుమంతు వేషమేసినోడు కూర్చోనూ లేడూ, తిన్నగ నిలబడాలేడు. ఇదిగీ వేషమేస్తే...యింతే.." అని తన వీపు వెనక సరంజామాని చూపేడు.

"...ఇద్దరు కొడుకులూ పెళ్లీపేరంటాలు చేసుకొని, ఎలిపోనారు ఆళ్ల బతకులికి. ఆళ్ల చదువులకీ, నౌకరీకీ...వున్న కసింతభూమీ అమ్మేసేడు. పోన్లే భార్యాభర్తలిద్దరూ బతకలేరా అనుకుంటే, అదేం ఫేక్టరీలో? యెపుడూ లాకవుట్లూ, మూసివేతలే! ఈలోగా ఆవిడికి గర్భసంచిల కేన్సరు వొచ్చింది..." కురిమినాయుడి బతుకుని చెప్పబోతోంది సరస్వతక్క.

"...కేన్సర్‌కీ మందులేదు. పేదరికానికీ మందులేదు.." నవ్వేడు కురిమినాయుడు. కమల టీ కప్పుల్తో వొచ్చి అక్కడి వారికిచ్చి; కారు దగ్గరి వాళ్ళను కేకేసింది.

అప్పుడే పట్నం నుంచి ట్రిప్పుల బస్‌వొచ్చి, వీధి రోడ్డు మీద ఆగింది... చుట్టూ దుమ్మురేపి! వెనకడోర్ నుంచి జయక్రిష్ణ దిగేడు. చేతిలో పాలిథిన్ సంచుల్తో – యేవో సామాన్లు! గడపలోని బంధువుల్ని పలుకరించి, చేతిలో సామాన్లు కమలకి అందించేడు.

"...యెంత సేపయ్యిందీ వొచ్చి? మీరీ రోజొస్తారని తెలీదు..." అన్నాడు. ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"...నాకూ తెలీదు..." సరస్వతక్క గభాల్నచెప్పి;

"...మీరింతలోనొస్తారనుకోలేదు..." అంది. ఎందుకో, సంజాయిషీలా మాట్లాడింది.

జయక్రిష్ణ, కాసేపు మౌనం వహించి –

"...రిటైర్‌మెంటు యింకెన్నాళ్లుంది మామా? రిటైరైతే యిక్కడ కొచ్చేస్తావా...?" అనడిగేడు భానుమూర్తిని.

"...నువ్విక్కడ్నించి వెళిపోయి మామని వొస్తావా అనడగుతావేటీ? జన్మభూమి.. కబుర్లొద్దు. బతికిందే ఊరు.." అన్నాడు కురిమినాయుడు.

"...మేము, మళ్లీ యిపుడే బయల్దేరాలి. నీ కోసమే ఆగేం. రాత్రికి తిరిగి చేరాలనే టేక్సీ తెచ్చేను..." అన్నాడు భానుమూర్తి.

జయక్రిష్ణ యేమీ మాట్లాడలేదు. తల్లివేపు చూసేడు. ఆమె, గభాల్న కూచున్నచోటు నుంచి లేచి యింట్లోకి వెళ్లింది.. కారు దగ్గర నుంచి శాస్త్రి తిరిగొచ్చి పిల్లలకి టాటా చెప్తున్నాడు. వెంకట్నాయుడూ బయల్దేరేడు. భానుమూర్తి మేనల్లుడికేదో...విశదీకరించాలని మనసు పోరుతోంటే మాటలుగా అనువదించబడక సతమతమవుతున్నాడు. ఈలోగా, సరస్వతక్క యింట్లోంచి సంచీ తీసుకువొచ్చేసింది ప్రయాణానికి! చివరికి గొంతుపెగిల్చి-

"మేం బయల్దేరతామయితే.." అన్నాడు భానుమూర్తి.

సరస్వతక్క జయక్రిష్ణవైపు చూసింది. జయక్రిష్ణ, దీర్ఘంగా నిట్టూర్పొదిలి-

"...మామా ఎవురి ప్రయాణాన్నీ ఎవరం ఆపలేం. ఎవురెటుపయనిస్తన్నమో గూడా అర్థమవదు. తల్లీ, దండ్రీ, పిల్లలూ, బంధువులూ, స్నేహితులూ, గ్రామాలూ, పట్నాలూ, దేశాలూ యెవరికి వారుగా యేదో విశదమైపోయి, భవిష్యత్తేదో వెలుగయి కన్పిస్తంటే చేసే ప్రయాణాలు గావివి. యిక్కడ, యిప్పుడు బాగోక వర్తమానం బాగాలేక పారిపోతున్న యాత్రలన్నించట్లేదూ? నాకు యింతకి మించి బోధపడ్లేదో. బోధపడిందాన్ని... చెప్పలేకపోతన్నానో మరి. అదన్నమాట!.." జయక్రిష్ణ మాటలాగినయిగానీ, ఉద్వేగం ఆగలేదు.

భానుమూర్తీ, శాస్త్రీ, వెంకట్నాయుడూ తమ యిన్నేళ్ల జీవన యానాన్నీ ఆ క్షణం వొక్కసారి సమీక్షించుకోసాగేరు. నిశ్శబ్దమేర్పడిందా క్షణం! పిల్లలు గూడా అవాక్కయి నిల్చున్నారు.

ఆ క్షణం తర్వాత, తన వీపు మీది కేన్‌నీ, స్ప్రేయర్‌నీ సర్దుకొని-

"....బతుకుల్ని బోధపడనిదేదో మింగేస్తుంది. భానుమూర్తీ వొకటి సెప్పు... వ్యవసాయానికేటి గావాల?" అని ప్రశ్నించేడు కుర్మినాయుడు.

"భూమి గావాల, నాగలి గావాల...క్షణకాలం తటపటాయించి, వొప్పజెప్పసాగేడు" భానుమూర్తి.

"...వొద్లూ, గొడ్లూ వుండాల, నిజమే. గానిపుడవి సాలవు. వొడ్లు..అంటే యిత్తనాలు..అవి నీవిగావు. గొడ్లకి మించిన యంత్రాలు అవి యెవురివో? మరిపుడు గొడ్డులాగ సెమటోడ్చే రైతుగాదు. తెలివయిన రైతు గావాలి వ్యవసాయంకి! యంత్రాలు తేవాలి. మందులు తేవాలి. ఆటికి మించి మార్కెట్ మంత్రాలు తెలాలి! ప్రెపంచికంలోని మార్కెట్‌ని..యింటిలోని యింటర్నెట్‌ల తెల్సుకోవాల. ఆడే రైతు. ఆడిదే వ్యవసాయం. ఇక, తెలివయిన మనుషులదే ప్రపంచమంటున్నారు మన నాయకులు. చెప్పండి మన రైతులు దద్దమ్మలా..? దద్దమ్మల్ని యేంజేసి మీరు వైస్‌మెన్ సొసైటీ నిర్మిస్తారు..? వొకప్పుడు వేదాలు వల్లించి కొందరు తెలివయిన లోకం నిర్మించుకున్నారు. ఇప్పుడు విజ్ఞాన శాస్త్రం వల్లించి...వైజ్‌మెన్ సొసైటంటన్నారు.

ఇదిగీ పురుగులమందుతోటి పురుగులు సస్తాయేమోగానీ; పంటలు పండీవుగదా? పండించీ రైతుకి – పురుగులమందే పెరుగన్నం జేసినదేదో, దానికి మందుగొట్టాల... ఆc... అంతే..." అన్చెప్పి; ఆగకుండా వెళిపోయేడు.

భానుమూర్తికీ, మిగిలిన మిత్రులకీ అప్పటికర్థమైంది. తమకంటే వయసులో చిన్నవాళ్లే అయినా బతుకొక యుద్ధంగా బతికి జ్ఞానం గడించిన వాళ్లు తమకి విశదీకరించ గలిగేరన్పించింది. సానుభూతిగా జయక్రిష్ణను చూసేరు ముగ్గురూ!

సరస్వతక్క, పిల్లలకూ కోడలికీ వీడ్కోలు చెప్పి; కారెక్కి కొడుకువైపు చూసింది.

"...రేపో, మాపో మేమూ వెళిపోతాం. ఇంటి తాళాలు కురిమినాయుడికిస్తా.." గొంతునిండా దుఃఖపుజీరతో చెప్పేడు తల్లికి.

"నేనొచ్చేదాక ఆగలేరా...?"

"...మేము వెళ్లేదాకా...నువ్వాగలేదుగదా...?"

తల్లీ, కొడుకల అంతరంగంలోనే మిగిలిన ప్రశ్నలవి. కారు కదిలింది. ప్రయాణం సాగింది....!

♦ ప్రజాసాహితి – జనవరి, 2001 ♦